క్లుప్తంగా

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత



పెర్కిట్(ఆర్మూర్): వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మక పెంపొందుతుందని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లిల్లిపుట్ పాఠశాలలో బుధవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో లైఫ్ హాస్పిటల్ వైద్యుడు రాంగిరి భాను, పాఠశాల కరస్పాండెంట్ లిల్లిపుట్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

నందిపేట్(ఆర్మూర్): రానున్న పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మసీదుల వద్ద మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ముస్లిం మండల కమిటీ నాయకులు వివిధ శాఖల మండల స్థాయి అధికారులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ముస్లిం కాలనీలలో పరిశుభ్రతపై దృష్టి సారించాలని, నిరంతర విద్యుత్ ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మండల కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ జావీద్, మహమ్మద్ అక్బర్, మహీముద్, షాదుల్లా, మోయిన్, ఫరీద్, చాంద్ పాషా, డాక్టర్ జావేద్, ముస్లిములు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మాక్లూర్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధులు దరిచేరవని గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సరిత అన్నారు. మండలంలోని దుర్గానగర్ కింది తండాలో బుధవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరానికి ఆమె హాజరై మాట్లాడారు. పరిసరాల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం సామాజిక కార్యక్రమాలపై తండా వాసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంగమాంబ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుమలత, శ్వేత, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోడు భూములకు క్రాప్ లోన్లు ఇవ్వాలి

వర్ని(చందూర్): ప్రభుత్వం ఇచ్చిన పోడు పట్టాలకు క్రాప్ లోన్లు ఇవ్వాలని కోరుతూ చందూర్ జెడ్పీటీసీ, జెడ్పీ ఫ్లోర్ లీడర్ అంబర్ సింగ్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ జిల్లాలో పోడు భూములకు క్రాప్ లోన్లు ఇస్తున్నారని జిల్లాలో బ్యాంక్ అధికారులు రుణాలు ఇవ్వడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో చర్చించి క్రాప్ లోన్లు ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

పరీక్ష అట్టల పంపిణీ

మోర్తాడ్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షల అట్టలను బుధవారం మోర్తాడ్‌లోని మహాత్మజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, తిమ్మాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షలను బాగా రాసి మంచి గ్రేడ్ సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు నీరజ్, కాంగ్రెస్ నాయకులు బద్దం రాజశేఖర్, జక్కం అశోక్, గుర్రం రమేశ్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నూతన ఆర్డీవోగా రాజాగౌడ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఆర్డీవో గా విధులు నిర్వర్తించిన వినోద్‌కుమార్ బదిలీ కాగా ఆయన స్థానంలో బోధన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్డీవో రాజాగౌడ్ ఆర్మూర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఆర్డీవోను, బదిలీపై వెళ్తున్న ఆర్డీవో వినోద్‌కుమార్‌ను కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఆలయాలు ముస్తాబు

రుద్రూర్/ బాల్కొండ: మహాశివరాత్రి సందర్భంగా రుద్రూర్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లోని శివాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల్లో శుక్రవారం ఉదయం నుంచి స్వామి వారికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. రుద్రూర్ మండల కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయం, ముప్కాల్ మండలంలో పడిలేచిన మర్రిచెట్టు వద్ద, కొత్తపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయం, మెండోరా మండలంలోని వెల్కటూర్, పోచంపాడ్ శివాలయాల్లో, బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్‌లో ఉన్న శివాలయాన్ని ఉత్సవాలకు ముస్తాబు చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

అపురూపం ఏకచక్రేశ్వర ఆలయం

- 1959లో వెలుగుచూసిన చారిత్రక ఆలయం
- సాలగ్రామ శిలతో శివలింగం ఏర్పాటు
- మహాశివరాత్రికి ముస్తాబైన ఆలయం



ఆలయంలో కొలువైన ఏకచక్రేశ్వరుడు



ఉత్సవాలకు ముస్తాబైన ఏకచక్రేశ్వర ఆలయం

బోధన్‌రూరల్: పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయం చరిత్రకు సాక్షిగా నిలిచింది. బోధన్ కేంద్రాన్ని రాజధానిగా అనేక రాజవంశాలు పరిపాలించాయి. 13వ శతాబ్దంలో బోధన్ ప్రాంతాన్ని పరిపాలించిన కాలంలో ఈ ప్రసిద్ధ ఏకచక్రేశ్వరాలయాన్ని నిర్మించబడినట్లు శివ లీలామృతం అనే ప్రాచీన సంస్కృత గ్రంథంలో పేర్కొనబడిందని చారిత్రిక ఆధారాలు చెబుతున్నాయి. కాకతీయ పరిపాలనలో ముష్కరులు దక్షిణ దేశ దండయాత్రకు పూనుకున్న సమయంలో ముష్కరుల నుంచి ఆలయాన్ని రక్షించుకునేందుకు ఈ ప్రాంతం వారు మట్టితో ఆలయాన్ని కప్పి వేసి ఉంటారని ప్రచారంలో ఉంది. శుక్రవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ ఏకచక్రేశ్వర శివాలయం విశిష్టతపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

1959లో ఫ్రిబవరి7న (పుష్య బహుళ అమావాస్య రోజు) తవ్వకాల్లో ఆలయం వెలుగు చూసింది. గుంటూరు వాస్తవ్యుడైన రామిరెడ్డి అనే వ్యక్తి బోధన్‌లో స్థిరపడటానికి ఒక మట్టికోటను చదును చేస్తుండగా ఈ ఆలయం బయట పడినట్లు బోధన్ పూర్వీకులు చెబుతున్నారు. నాలుగువైపుల ద్వారాలతో మండపం రూపంలో బయట పడిన ఈ ఆలయం అందరినీ ఆకర్షించింది. ఇందులో నాలుగు రాతి స్థంబాలు, పైన రాతికప్పు, మధ్యలో శివలింగం ఉన్నాయి. ఏకచక్రపురంలో వెలిసిన ఆలయం కావున ఆలయాన్ని నాటి నుంచి 'శ్రీఏకచక్రేశ్వర శివాలయం' గా పిలువబడింది.

ఆలయంలో శివలింగానికి నాలుగువైపులా అభిషేకం చేసేలా ఉండటం మరో విశేషం. కాలక్రమేన ఈ ఆలయానికి మూడు వైపులా గోడలు నిర్మించి పశ్చిమాభిముఖ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఆలయంలోకి శివలింగానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. సముద్రం నుంచి తీసుకొచ్చిన సాలగ్రామము శిలతో ఈ శివలింగాన్ని తయారు చేసి ప్రతిష్ఠించారు. ఈ శివలింగానికి నిత్యం పూజలు చేస్తుండటంతో ఈ ప్రాంతంలో ఉండేవారికి ధన ధాన్యాలకు లోటు శివపురాణం చెబుతోంది. ప్రతి సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

ఘనంగా శివరాత్రి ఉత్సవాలు

దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో తెల్లవారుజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శనివారం స్వామివారి రథోత్సవం ఊరేగింపు ఉంటుందని అన్నారు. భక్తులు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

శివలింగానికి ఎంతో మహిమ



శ్రీ చక్రేశ్వర ఆలయంలోని శివలింగానికి అత్యంత మహిమ ఉంది. సముద్రం నుంచి తీసుకొచ్చిన సాలగ్రామం శిలతో శివలింగాన్ని చేసి ప్రతిష్ఠించారు. మహా శివరాత్రి పర్వదినం రోజు ఈ శివలింగాన్ని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయి.

– కర్నె హనుమంత్ రావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

ఏర్పాట్లు పూర్తి



మహా శివరాత్రిని పురస్కరించుకుని ఏకచక్రేశ్వరాలయానికి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులు ప్రశాంత వాతవరణంలో స్వామివారిని దర్శించుకుని ఉత్సవాలను విజయవంతం చేయాలి.

– రవీందర్, కార్యనిర్వాహణ అధికారి

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



రెంజల్(బోధన్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీపీ లోలపు రజని, జడ్పీటీసీ విజయ సూచించారు. బుధవారం రెంజల్ రైతు వేదికలో మహిళా సంఘాల సభ్యులకు నారీ శక్తి వందన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గోపీకృష్ణ, శ్రీధర్, పోచయ్య, యోగేశ్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ప్రతినిధికి సన్మానం

బోధన్: పట్టణంలోని పాన్‌గల్లీకి చెందిన ప్రముఖ రైతు నాయకుడు కర్నె హన్మంత్‌రావు స్థానిక పురాతన చారిత్రిక ఏకచక్రేశ్వరాలయం మహాశివరాత్రి ఉత్సవ కమిటీ సభ్యుడిగా ఇటీవల నియమాకమయ్యారు. బుధవారం ఆయన స్వగృహంలో వీరశైవ లింగాయత్, జంగమ సమాజ్ పట్టణ ప్రతినిధులు హన్మంత్‌రావును ఘనంగా సన్మానించారు. వీరశైవ లింగాయత్ సమాజ్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు వీఆర్ దేశాయ్, శ్యాంరావు, జంగమ సమాజ్ ప్రతినిధులు శివకుమార్ అప్పా, అజయ్‌కుమార్, బాబయ్యప్ప, నర్సింగ్ అప్పా, శంకర్‌అప్పా, ప్రభు అప్పా, సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ క్రైంపై అవగాహన సదస్సు నిర్వహించారు. లోన్, లాటరీ పేరుతో వచ్చే మెసేజ్‌లు, సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలన్నారు. అనంతలరం ఇటీవల సాఫ్ట్‌బాల్ పోటీల్లో కెప్టెన్‌గా వ్యహరించి బంగారు పతకం సాధించిన అజ్మీరా ఇందును డీఎస్పీ సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో రవికుమార్, ఎస్సై ప్రవళిక, ప్రిన్సిపాల్ ధనవేణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుదారులకే 'గృహజ్యోతి'



మాట్లాడుతున్న ఏడీ రవికుమార్

వర్ని(చందూర్): ఒక రేషన్ కార్డుకు ఒకరికే గృహజ్యోతి పథకం వర్తిస్తుందని విద్యుత్ శాఖ ఏడీ రవికుమార్ అన్నారు. బుధవారం చందూర్ మండల కేంద్రంలో పథకం అమలు, క్షేత్రస్థాయిలో ఒడిదుడుకులు, సమస్యలను ఆయన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ 200 యూనిట్ల లోపు కరెంట్ బిల్లును ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎవరికైనా జీరో బిల్లు రాకపోతే మండల కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తు రసీదుతో పాటు కరెంట్ బిల్లు, ఆధార్ కార్డు, రేషన్ కార్డును అందజేయాలని సూచించారు. ఆయన వెంట వైసీపీ దశగౌడ్, ఏఈ మిథున్ సబ్ ఇంజినీర్ ఓం ప్రకాశ్, మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి రాంరెడ్డి ఉన్నారు.

మహిళల అభివృద్ధికి పాటుపడాలి

– జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితా యాదవ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్

ఎడపల్లి(బోధన్): మహిళల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితా యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బాలికల విద్యపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. అనంతరం మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, బోధన్ సీడీపీవో జానకి, సూపర్‌వైజర్ విజయరాణి, ఏటీఎం సాయిలు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిక



ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కేవీఆర్‌తో మాశెట్టి ఆదిత్య

రుద్రూర్: బీఆర్ఎస్ నుంచి పలువురు నాయకులు బీజేపీలో బుధవారం చేరారు. తెలంగాణ స్టేట్ పొలిటికల్ కమిటీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ సభ్యుడు మాశెట్టి ఆదిత్య గుప్తా ఎంపీ బీబీ పాటిల్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆదిత్య గుప్తా మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం కోసం ప్రజాసేవలో నిమగ్నం కావాలనే ఉద్దేశంతో బీజేపీలో చేరినట్టు ఆయన పేర్కొన్నారు.

సంక్షిప్తం

వేములవాడకు ప్రత్యేక బస్సులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఆర్టీసీ డిపో నుంచి మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు వేములవాడకు ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు డిపో మేనేజర్ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలకు రెంజల్ పోలీసులు సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు. రెంజల్ జమేదార్ సునీత మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న సైబర్ మోసాలు, అక్రమాలపై అవగాహన ఉండాలని సూచించారు. గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

నాణ్యతగా పనులు చేపట్టాలి

రుద్రూర్: మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని జెడ్పీటీసీ నరోజి గంగారాం కాంట్రాక్టర్‌కు సూచించారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. గ్రామ ప్రత్యేకాధికారి సంతోష్‌రెడ్డి, జీపీ కార్యదర్శి చైతన్య, గ్రామ కమిటీ చైర్మన్ పట్ల సురేశ్, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ బాపూజీ లింగం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

రెంజల్(బోధన్): పిల్లల ఆరోగ్యం పై తల్లులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ ప్రమీలరాణి సూచించారు. మండలంలోని కూనేపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. మహిళా సాధికారత గురించి మహిళలకు వ్యాసరచన, రంగోలీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

నేడు పశు వధశాల వేలం

బోధన్: పట్టణ పశు వధశాల 2024–25 సంవత్సరానికి గాను వేలాన్ని గురువారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్, డీఈఈ శివానందం బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న పశు వధశాలకు వేలం నిర్వహించగా, గత ఏడాది కంటే తక్కువ వేలం వచ్చినందున వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని సిద్దాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బుధవారం ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రూ. 5 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, బైండ్ల ప్రశాంత్ ఎంపీటీసీ శ్రీనివాస్, యూసుఫ్, ఖదీర్, గంగారెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రం.. నవనాథ సిద్ధుల గుట్ట

- నాటి నవనాథపురమే నేటి ఆర్మూర్
- ప్రకృతి రమణీయతకు నిలువెత్తు నిదర్శనం
- శివరాత్రికి ముస్తాబైన ఆలయం



ఆర్మూర్: ప్రకృతి రమణీయతకు అద్దం పట్టేలా ఒక దానితో ఒకటి పేర్చినట్లుగా నల్లని రాళ్లతో విస్తరించి ఉండి చరిత్రాత్మకమైన ప్రాశస్త్యాన్ని సంతరించుకుంటోంది పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్ట. సహజ సిద్ధంగా ఏర్పడిన గుట్టపై సువిశాలమైన స్థలంలో నిర్మించిన ఆలయాలు, ప్రకృతి వింతలు చూపరులను, పర్యాటకులను ఆకట్టుకుంటోంది. పురాతన కాలంలోని మహర్షులు నిర్మించిన మందిరాలు ఆధ్యాత్మిక శోభను హృదయానికి హత్తుకునే వాతావరణాన్ని ఏర్పర్చాయి. మహాశివరాత్రి సందర్భంగా నవనాథ సిద్ధుల గుట్టపై ప్రత్యేక కథనం..

నల్లని రాళ్లను ఒకదగ్గర పేర్చి..

నల్లని రాళ్లను ఒకదగ్గర పేర్చి కుప్పగా పోసినట్లు ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన ఈ సిద్ధుల గుట్టను పరిశీలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. గుట్టపైకి వేళ్లే ఘాట్ రోడ్డు మార్గం ప్రారంభంలో నవనాథుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. కింది నుంచి చూస్తే కేవలం రాళ్లు మాత్రమే కనిపించినా గుట్ట పైకి వెళ్లి చూస్తే సువిశాలమైన భూభాగం అక్కడ కనిపిస్తుంది. నవనాథులు పూజించిన సిద్ధేశ్వరుని లింగాన్ని రాళ్ల గుహలో నుంచి వెళ్లి దర్శించుకోవడం చక్కని అనుభూతిగా ఉంటుంది. ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందడంతో కొన్ని దశాబ్దాల కాలం క్రితమే గుట్టపై శ్రీరాముని ఆలయాన్ని నిర్మించారు. గుట్టపై నిత్యం నీరుండేలా కోనేరును ఏర్పాటు చేశారు. గుహల మధ్య సహజ సిద్ధంగా ఏర్పడిన పాల గుండం, నీటి గుండం భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. రాతి యుగం కాలంలో గుట్టకు దక్షిణం వైపున ఆర్మూర్ పట్టణ ప్రజలకు కనించేలా ఏక శిల స్థూపాన్ని నిర్మించారు. ఈ స్థూపంపై రూపాయి కాయిన్ వేస్తే అది స్థూపం పైన పడితే మనసులో కోరుకున్న కోరికలు నెరవేరుతాయనేది ప్రజల నమ్మకం. మహా శివరాత్రి, శ్రీరామ నవమి సందర్భంగా ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. గతంలో గుట్టపైకి ఎక్కాలనుకునే వారు ఇబ్బంది పడాల్సి వచ్చేది. ప్రస్తుతం ఘాట్ రోడ్డు నిర్మాణం అందుబాటులో ఉండటంతో వాహనాలను గుట్టపైకి నేరుగా తీసుకెళ్తున్నారు.



ఆలయ ప్రవేశ ద్వారం

భక్తులకు అన్ని సౌకర్యాలు

శుక్రవారం నిర్వహించే మహాశివరాత్రి వేడుకలకు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

అరుదైన అనుభూతిగా..



శివరాత్రి పర్వదినాన సిద్ధుల గుట్ట పర్యటన ప్రతి ఒక్కరికీ అరుదైన అనుభూతిగా మిగులుతుంది. ప్రతీ ఒక్కరు ఈ దైవ కార్యంలో భాగస్వాములు కావాలి. ఇక్కడి శివున్ని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయనేది భక్తుల నమ్మకం.

– సుమన్, సిద్ధుల గుట్ట ఉత్సవ కమిటీ ప్రతినిధి

పాఠశాలకు స్మార్ట్ టీవీ అందజేత



డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి స్మార్ట్ టీవీని డొనేట్ చేశారు. డిజిటల్ పాఠాలు నేర్చుకునేందుకు టీవీ ఉపయోగపడుతుందని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం సాబేర బేగం, ఉపాధ్యాయులు మోహన్, కిషన్, ప్రసాద్, నరేశ్, శ్రీరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



పెర్కిట్(ఆర్మూర్): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను హెచ్ఎం రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోతె మోహన్, విఠల్, శోభ, విజయజ్యోతి, శారద, సంగీత, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ కార్యక్రమాన్ని వీక్షించిన మహిళలు

వేల్పూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం వర్చువల్‌గా నిర్వహించిన సందేశ కార్యక్రమాన్ని వేల్పూర్ మండల కేంద్రంలో మహిళలు తెరపై వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ బాల్కొండ నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, కో కన్వీనర్ నీలిమ, బద్దం రాజారెడ్డి, ముప్కాల్ ఎంపీటీసీ పద్మ, మహిళలు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తు గడువు పొడిగించాలి



బోధన్: ధరణి దరఖాస్తుల గడువు పొడిగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏఐకేఎస్ నాయకులు ధర్నా నిర్వహించి అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ధరణి పోర్టల్‌లో భూమి వివరాల నమోదులో అనేక తప్పులు చోటు చేసుకున్నాయని, సాదాబైనామా భూముల సమస్య పరిష్కరించాలని కోరారు. భూసమస్యలు సంపూర్ణంగా పరిష్కరానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డివిజన్ నాయకులు పుట్టి నడ్పి నాగన్న, షేక్ నసీర్, మల్లేశ్, హన్మాండ్లు, సుదర్శన్, పోశెట్టి, రవి, వైద్యనాథ్ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	మా ఊరి రాజారెడ్డి – 10.30 వ్యూహం (తెలుగు) – 1.00 ఊరు పేరు భైరవకోన – 3.45 ముఖ్య గమనిక (తెలుగు) – 7.00 కిక్ (తెలుగు) – 9.45
స్క్రీన్-2 –	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) – 12.15, 3.10, 6.05, 9.00
స్క్రీన్-3 –	ఊరు పేరు భైరవకోన (తెలుగు) – 12.45, 10.00 హనుమాన్ (తెలుగు) – 3.45 ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు)-7.05
స్క్రీన్-4 –	ఇంటి నెంబర్ -13 – 10.45 చారి-111(తెలుగు) – 1.30, 7.20 భూతద్దం భాస్కర్ – 4.20, 10.10

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



బాల్కొండ: మెండోరా మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం మంజూరు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ల్యాబ్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. విద్యార్థులు కంప్యూటర్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సాయన్న, వైద్యుడు ప్రకాశ్, హెచ్ఎం మంత్రి రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడుదాం

పెర్కిట్(ఆర్మూర్): మహిళలు తమ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు లక్ష్మక్క అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలూర్ మండలం మిర్దాపల్లిలో బుధవారం మహిళా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దాసు, ధనలక్ష్మి, సూర్య శివాజీ, సత్యమ్మ, ఎర్రక్క, లావణ్య, బేస్త లక్ష్మి, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.